ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 14 మార్చి 2025





ఉష్ణోగ్రతలు

గురువారం	
గరిష్ఠం	39.0
కనిష్ఠం	23.0



హనుమంత వాహనంపై ఖాద్రీశుడు
(వివరాలు 6లో..)



ఇఫ్తార్	సెహరీ
6.31	5.11
శుక్రవారం సాయంత్రం	శనివారం ఉదయం



ఇంటి దావ పడితే.. ఎంత బరువైనా తేలికే.



సంచి విసిరితే సీటు మనదే..





ఆనందం.. కళ్లలో..





వడి వడిగా ఊరి బస్సు వైపు అడుగులు..



దూరదమే..

భలే మంచి రోజు..!

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ముగిశాయి. కాంక్రీట్ గూటిలో బంధీలుగా ఉన్న గువ్వలన్నీ రివ్వున ఇళ్లకు ఎగిరిపోయాయి. పుస్తకాలు, దుస్తులు, ఇతర సామగ్రిని సంచులు, ట్రంకు పెట్టెల్లో సర్దుకుని.. అంతటి భారాన్ని అలవోకగా మోసుకుపోయారు. ఊళ్లకు వెళ్లే విద్యార్థులు, తీసుకువెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులతో అనంత బస్టాండులో సందడి కనిపించింది. బస్సులు రాగానే కిటికీల్లోంచి సంచులు, టవళ్లు, జేబు రుమాళ్లు వేస్తూ ఎప్పటిలాగానే 'సంప్రదాయ రిజర్వేషన్' చేసుకున్నారు. మరికొందరు కిటికీల్లోంచి దూరి సీట్లను ఆక్రమించారు. అందరి ముఖాల్లో ఒకటే ఆనందం..! ఇంటికెళుతున్నామోచ్.. అన్నట్లు..!

-ఆంధ్రజ్యోతి అనంతపురం కల్చరల్

ఎక్స్‌క్యూజ్ మీ..! నా వేలు మీకు దొరికిందా..?

వేలు దొరకడం ఏమిటి..? చాన్నాళ్లుగా ప్రశాంతంగా ఉన్నాం కదా..! మళ్లీ ఏమైనా ఫ్యాక్షన్ గొడవలు జరిగాయా..? ఎవరైనా నరుక్కున్నారా..? అని కంగారు పడొద్దు..! వేలంటే వేలు కాదు..! వేలు లాంటిది..! రబ్బరుతో తయారు చేసింది. రేషన్ బియ్యం వేసే సమయంలో.. కార్డుదారు లేకుండా, రబ్బర్ వేలును ఉపయోగిస్తున్నారన్నమాట..! ఆ వేలు.. పొరపాటున జారిపోయి.. బియ్యంలో కలిసిపోయింది..! దాని కోసం వెతుక్కుంటూ.. ఓ వ్యక్తి 'నా వేలు దొరికిందా..? నా వేలు దొరికిందా..?' అని అందరినీ ఆరా తీయడంతో అసలు గుట్టు బయట పడింది.

ఇంతకీ ఎవరి వేలు...

యాడికి మండల కేంద్రంలోని కొండకింద వీధికి చెందిన ఓ మహిళ బెంగళూరులో ఉంటున్నారు. ఆమె కుటుంబానికి స్థానికంగా రేషన్‌కార్డు ఉంది. సమీప బంధువు వారి రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. ప్రతినెలా ఆమె సరుకుల కోసం బెంగళూరు నుంచి యాడికి రావాలంటే ఇబ్బంది.. ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. దీంతో ఆమె బంధువు 'రబ్బరు వేలు' ఉపాయం ఆలోచించారు. రూ.3 వేలు ఖర్చు చేసి, ఆమె వేలి ముద్రలతో కృత్రిమ వేలును తయారు చేయించారు. మార్చి నెల రేషన్ సరుకుల కోసం వేలిముద్ర వేసే సమయంలో అది జారిపోయి బియ్యంలో కలిసిపోయినట్లు తెలిసింది. ఆలస్యంగా గమనించిన ఆ వ్యక్తి, రేషన్ బియ్యం కోసం వచ్చిన అందరినీ 'వేలు దొరికిందా..?' అని ఆరా తీశారు. రబ్బరు వేలు వ్యవహారం యాడికిల్ హాట్ టాపిక్‌గా మారింది. కృత్రిమ వేలిముద్రతో రేషన్ డీలర్ సరుకులను ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. కొందరు రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కృత్రిమ వేళ్లను వాడుతున్నట్లు తెలిసింది. ఎండీయూ ఆపరేటర్ వేలిముద్ర వేయనిదే రేషన్ సరుకుల పంపిణీకి అవకాశం లేదు. దీంతో వారి వేలి ముద్రలను తయారు చేయిస్తున్నారని సవ ం



చారం. ఈ పద్ధతి కొనసాగితే.. వేలి ముద్రలను అక్రమాలకు వినియోగించే ప్రమాదం ఉంది. అధికారులు విచారించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, యాడికి

ఆదర్శమూర్తి.. మొల్లమాంబ : కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్లమాంబ ఆదర్శమూర్తి అని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. ఆమె జయంతి వేడుకలను గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కవియిత్రి మొల్లమాంబ రాయలసీమలో పుట్టడం గర్వకారణమన్నారు. ఆమె తెలుగు భాష కోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలుగులో వచ్చిన అర్జీలకు ప్రథమ ప్రాధాన్యమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీఆర్వో మలోల, ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక, కుమ్మరశాలివాహన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఓబుళపతి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, టీడీపీ కుమ్మర శాలి వాహన సమితి రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య పాల్గొన్నారు.



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

కూతలేరు వంకపై బ్రిడ్జి నిర్మించండి

సీఎం, మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ వినతి

అనంతపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గం అలంకరాయునిపేట గ్రామంలో కూతలేరు వంకపై బ్రిడ్జి నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడుకు శింగనమల, మడకశిర ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నిమ్మలను వారి చాంబర్లలో వేర్వేరుగా ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ కలిసి వినతి పత్రాలు అందజేశారు. వర్షాకాలంలో కూతలేరు వంక పొంగినపుడల్లా అలంకరాయునిపేట వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఎం, మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతమన్నారు. ఈ నేపథ్యంలో.. వర్షాకాలం రాకముందే కూతలేరు వంకపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజలు, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వంకపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సీఎం, మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.



మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

బంధాలు సరిగా లేక..!

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

(వివరాలు 6లో...)

అదిరిందయ్యా.. దుర్గం..!

కళ్యాణదుర్గంలో అభివృద్ధి పరుగులు

జోరుగా రోడ్ల విస్తరణ, డ్రైనేజీ కాల్వల నిర్మాణం

ప్రజలకు తప్పిన మురుగు నీటి కష్టాలు

కళ్యాణదుర్గం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణం అంటేనే గుర్తొచ్చేవి ఇరుకు రోడ్లు, వాటిపైనే మురుగు ప్రవాహాలు, దుర్గంధం, ఎటుచూసినా చెత్తాచెదారం. పట్టణ ప్రజలు నిత్య నరకం అనుభవించేవారు. దశాబ్దాలుగా పట్టణ సమస్యలు అలానే ఉండేవి. గత వైసీపీ హయాంలో ఒకట్రెండు పనులు హడావుడిగా చేపట్టారు, అర్ధంతరంగా ఆపేశారు. దీంతో పట్టణ ప్రజలకు కష్టాలు తప్పలేదు. కూటమి అధికారం చేపట్టాక అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ఎటుచూసినా రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నారు. రోడ్లపై మురుగు ప్రవాహాలను ఆపే దిశగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. కల్వర్టులు సైతం కడుతున్నారు. ప్రస్తుతం దాదాపు రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మరో రూ.30 కోట్ల పనులు ప్రతిపాదన దశలో ఉన్నాయి. దీంతో మురుగునీటి కష్టాలు తీరుతున్నాయని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ పాలనలో అటకెక్కిన అభివృద్ధి

మేజర్ పంచాయతీగా ఉన్న కళ్యాణదుర్గాన్ని 2012లో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. తొలి కౌన్సిల్ ఏర్పడినపుడు పట్టణంలో అక్కడక్కడా సీసీ రోడ్లు వేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలో అభివృద్ధి అటకెక్కింది. ఏఐబీబీ పథకం ద్వారా నీరందించే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, పునాదుల దశలోనే ఆపేశారు. పట్టణంలోని ప్రధాన రోడ్లపై మురుగు చేరి, చెత్తాచెదారంతో అధ్వానంగా ఉండేది. కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. కాలువల ఏర్పాటు, ఆదాయ వనరుల పెంపు తదితర పనులు జోరుగా సాగుతున్నాయి.



పాత బస్టాండు వద్ద సాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

మారుతున్న రూపురేఖలు

పట్టణంలో డ్రైనేజీ సమస్య దశాబ్దాలుగా ఉంది. టీడీపీ హయాంలో అనంతపురం-రాయదుర్గం ప్రధాన రహదారిని విస్తరించి, కాలువలు నిర్మించారు. హిందూపురం రోడ్డు దిశగా పనులు చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ వాల్మీకి సర్కిల్ నుంచి కంబదూరు రింగు రోడ్డు వరకు హడావుడిగా రోడ్డు పనులు మొదలెట్టింది. కొంత వరకు చేసి, ఆపేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వాల్మీకి, గాంధీ, టీ సర్కిళ్లలోని ప్రధాన రహదారులన్నింటినీ విస్తరిస్తున్నారు. అంతటితో ఆగకుండా వాటి పక్కనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు సైతం నిర్మిస్తున్నారు. దీంతో ఇరుకు రోడ్లు, మురుగు సమస్యలు తీరనున్నాయి. ఈ పనులతో పట్టణ రూపురేఖలే మారిపోతున్నాయి. పాత బస్టాండులో కల్వర్టు సైతం కడుతున్నారు. అలా.. పట్టణమంతా అభివృద్ధి పనులు చేస్తున్నారు. శెట్టూరు రోడ్డు పక్కనే డంపింగ్ యార్డు ఉండేది. అక్కడ చెత్త వేస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఆ చెత్తను రీసైక్లింగ్ చేయడం ద్వారా దుర్గంధానికి చెక్ పెట్టారు. ఆ స్థలం కబ్జా కాకుండా మున్సిపాలిటీ పేరున రిజిస్ట్రేషన్ చేశారు. ప్రహరీ నిర్మాణానికి సైతం చర్యలు చేపడుతున్నారు. ఆ స్థలంలో మున్సిపాలిటీ, మార్కెట్ భవనాలు నిర్మించాలని యోచిస్తున్నారు.

రూ.30 కోట్లతో ప్రతిపాదనలు



డంపింగ్ యార్డు స్థలంలో రూ.3 కోట్లతో మున్సిపల్ భవన్, రూ.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పాత బస్టాండులో రూ.1.80 కోట్లతో డ్రైనేజీ, టీ సర్కిల్‌లో రూ.15 కోట్లతో వాణిజ్య సముదాయం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. పట్టణంలో అభివృద్ధి పనులకు రూ.30 కోట్లు అవసరమని ప్రతిపాదించాం.

-వంశీకృష్ణ భార్గవ్, మున్సిపల్ కమిషనర్, కళ్యాణదుర్గం

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



కళ్యాణదుర్గాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం. వైసీపీ హయాంలో రోడ్లపైనే మురుగు నీరు పారుతూ, చెత్తాచెదారం నిండిపోయి అధ్వానంగా ఉండేది. కూటమి అధికారం చేపట్టాక రోడ్డు విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కల్వర్టు పనులు వేగంగా సాగుతున్నాయి. మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాం. -అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



అనంతపురం కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు 8 నుంచి 11 వారాల పనుల బిల్లులు రాలేదని, బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో గురువారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ పనుల్లేక కూలీలు వలస వెళ్లి రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని అన్నారు. జిల్లాలో ఏడింటిని మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారని, అక్కడ మాత్రమే ఉపాధి కూలీలకు 50 రోజుల అదనపు పని కల్పిస్తున్నారని అన్నారు. మేట్ల పనులకు పోటీ పడుతున్న అధికార పార్టీ నాయకులు, కూలీలకు డబ్బులు ఇప్పించడంపై శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు. పథకానికి నిధులు పెంచకపోవడం వల్ల కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఇంటి నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయిందని, రూ.కోట్లు ఖర్చుచేసి నిర్మించిన టిడ్కో, జగనన్న ఇళ్లు నిరుపయోగంగా మారాయన్నారు. మున్సిపాలిటీల్లో వేలాది మందికి జగనన్న ఇళ్లు మంజూరైనా పదిశాతం ఇళ్లను కూడా లబ్ధిదారులకు అప్పగించలేదన్నారు. అనంతపురం నగరంలో 22 వేల మందికి ఇళ్లు మంజూరైనా.. నిర్మాణం పూర్తి కాలేదని అన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించి, పేదల సొంతింటి కలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు జిల్లాకు వచ్చి సోలార్ ప్రాంతాల బాధితులను పరామర్శిస్తారని జిల్లా కార్యదర్శి నల్లప్ప తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య సావిత్రి, చంద్రశేఖర్ రెడ్డి, రామిరెడ్డి, కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు రాజు, రామాంజనేయులు, భాస్కర్, ముర్తాజ, వెంకటనారాయణ, జగన్, అచ్యుత్ పాల్గొన్నారు.

జిల్లాకు నలుగురు సీహెచ్‌ఓలు

అనంతపురం టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యశాఖలో రాష్ట్రస్థాయి పోస్టులకు ఉద్యోగోన్నతులు కల్పించారు. ఇప్పటివరకు ఎంపీహెచ్‌ఈఓలు, పీహెచ్‌ఎన్‌లుగా పనిచేస్తున్నవారికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. అర్హులకు ఈ నెల 11న విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ క్రమంలో జిల్లాకు నలుగురు సీహెచ్‌ఓలు నియమితులయ్యారు. వీరిలో రాజశేఖర్(శ్రీధరఘట్ట), బి.లక్ష్మీదేవి(వజ్రకరూరు), ఈశ్వరయ్య(బొమ్మనహాళ్), రాణి ఎస్తేరు(బ్రహ్మసముద్రం) పీహెచ్‌సీలకు సీహెచ్‌ఓలుగా నియమితులయ్యారు. డీఎంహెచ్‌ఓ ఈబీ దేవిని వీరు గురువారం కలిసి, విధుల్లో చేరారు. జిల్లాకు చెందిన బాల సూర్యనారాయణ ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లా గుడిపాల పీహెచ్‌సీకి సీహెచ్‌ఓగా వెళ్లారు.

బయటా.. లోపలా.. బయోమెట్రిక్..

పింఛన్ రీ వెరిఫికేషన్‌లో మాయలకు చెక్

పక్కాగా సర్టిఫికెట్ల పరిశీలన

అయినా ఆస్పత్రి దళారీ సిబ్బంది అక్కడే తిష్ట

అనంతపురం టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వజనాస్పత్రిలో దివ్యాంగ పింఛన్ రీ వెరిఫికేషన్‌లో బోగస్‌ల ఆట కట్టించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొందరు బోగస్‌లు రీవెరిఫికేషన్‌లో బయట బయోమెట్రిక్ వేసి.. లోపలికి వైకల్యం ఉన్నవారిని పంపించి డాక్టర్లను మస్కా కొట్టించి వైకల్యం ఉన్నట్లు ఆమోదం వేయించుకుంటున్నారు. ఆర్థో, దృష్టిలోపం పరీక్షల్లో ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు డాక్టర్లే గుర్తించి, అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ వ్యవహారాలపై 'రీ వెరిఫికేషన్‌లో మాయగాళ్లు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' గురువారం కథనం ప్రచురించింది. దీంతో ఉన్నతాధికారుల్లో చలనం వచ్చింది. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతోపాటు జిల్లా కలెక్టర్ సైతం ఈ మోసాలపై ఆరాతీసి, సీరియస్ అయినట్లు తెలిసింది. దీంతో గురువారం వైకల్య సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ నిర్వహిస్తున్న ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేక నిఘాచర్యలు తీసుకున్నారు. తొలుత వచ్చిన వారు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సీరియల్ నంబర్ కేటాయిస్తారు. దాని ఆధారంగా పేరు పిలిచి, వారికి బయట బయోమెట్రిక్ తీసి లోపలికి పంపుతున్నారు. లోపలకు వెళ్లాక డాక్టర్ గదిలో మరోసారి బయోమెట్రిక్ తీశారు. ఇలా రెండుసార్లు బయోమెట్రిక్ తీయడంతో బయట బయోమెట్రిక్ వేసిన వ్యక్తి.. లోపలకు వచ్చిన వ్యక్తి ఒకరేనా.. కాదా.. అని తెలిసిపోతుంది. అలా.. మోసాలకు అధికారులు ముకుతాడు వేశారు.



బయట బయోమెట్రిక్ తీసి.. లోపలికి పంపుతున్న సిబ్బంది, డాక్టర్ వద్దకు వెళ్లినపుడు మరోసారి ..

దళారీల తంటాలు..

అధికారులు వైకల్య సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌లో మోసాలకు ఆస్కారం ఇవ్వకుండా చర్యలు తీసుకుంటుంటే.. అదే జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న దళారీ సిబ్బంది అక్కడే తిష్టవేసి ఎలాగైనా కమిట్‌మెంట్ చేసుకున్నవారి వైకల్యంపై ఆమోదం వేయించడానికి సర్వశక్తులు ఒడ్డుతూ కనిపించడం చర్చనీయాంశంగా మారింది. రీ వెరిఫికేషన్ ప్రాంతంలో డీఆర్‌డీఏ ఉద్యోగులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనధికారికంగా ఆస్పత్రిలో పనిచేస్తున్న వివిధ విభాగాల సిబ్బంది, ఎంఎన్‌ఓలు, సెక్యూరిటీ స్టాఫ్ ఒప్పందం చేసుకున్నోళ్లకు వైకల్యం ఉన్నట్లు ఆమోదం వేయించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తూ కనిపించారు. గతంలో ఆస్పత్రి హెచ్‌ఓడీలతో వారికి ఈ బోగస్ వైకల్య మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయించారు. అవి నకిలీవని డాక్టర్లు రీవెరిఫికేషన్‌లో తేల్చితే తమ బండారం బయటపడుతుందని కొందరు డాక్టర్లే.. ఆస్పత్రి ఇబ్బందిని రంగంలోకి దింపి రీ వెరిఫికేషన్‌కు వచ్చిన శ్రీసత్యసాయి జిల్లా వైద్యులపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. గురువారం కూడా 8 మంది వరకు ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది అక్కడే ఉంటూ తమదైన శైలిలో అక్రమదారులకు మార్గాలు చూపిస్తూ కనిపించారు. ఈ లెక్కన సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ మోసాల్లో ఆస్పత్రి సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎవరినీ నియమించలేదు: డా. వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

రీ వెరిఫికేషన్ విధులకు ఆస్పత్రి సిబ్బంది ఎవరినీ నియమించలేదు. అక్కడ ఎందుకు ఉంటున్నారో తెలీదు. వారిపై ప్రత్యేకంగా విచారణ చేయించి, చర్యలు తీసుకుంటాం.

రంగుల పండుగ.. హోలీ నేడే



అనంతపురం కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రంగుల పండుగ హోలీ వచ్చేసింది. శుక్రవారం హోలీ పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా చేసుకోనున్నారు. స్నేహితులు, బంధువులు పరస్పరం రంగులు చల్లుకోవడం ఆనవాయితీ. సహజ రంగులతో హోలీ చేసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సింథటిక్ రంగుల వాడకంతో అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లేనని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్త వహించకపోతే ప్రమాదమే

హోలీలో వాడే సింథటిక్ రంగులు చర్మంపై దుష్ప్రభావాలను చూపుతాయి. రంగుల్లో రసాయనాలు కలిసుండటం వల్ల అలర్జీ వచ్చే అవకాశం ఉంది. ఆస్మా పీడితులకు సమస్య తీవ్రం కావచ్చు. రంగులు చల్లుకున్నాక ఎండకు వెళితే చర్మం నల్లగా మారొచ్చు, బొబ్బలు కూడా రావొచ్చు. ఈ దుష్ప్రభావాల బారిన పడకూడదంటే ప్రకృతి సిద్ధ రంగులను వాడడం శ్రేయస్కరం. లేదంటే హోలీ ఆడడానికి ముందే శరీరానికి మాయిశ్చరైజర్‌గానీ, కొబ్బరి నూనె గానీ పూసుకోవాలి. తద్వారా రంగులు శరీరానికి అంటే అవకాశం తక్కువ. హోలీ ఆడాక మంచినీటితో శుభ్రంగా కడుక్కోవాలి.

- డాక్టర్ చల్లా నీలిమ, చర్మవ్యాధి నిపుణురాలు

పలు రైళ్లకు అదనపు స్టాపేజీలు కొనసాగింపు

విజయవాడ రైల్వేస్టేషన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పలు రైళ్లకు అదనపు స్టాపేజీలను మరో ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. 17011 హైదరాబాద్-సిర్పూర్ కాగజ్ నగర్, 17012 సిర్పూర్ కాగజ్‌నగర్-బీదర్, 12713 విజయవాడ-సికింద్రాబాద్, 12714 సికింద్రాబాద్-విజయవాడ, 12706 సికింద్రాబాద్-గుంటూరు, 12705 గుంటూరు-సికింద్రాబాద్ రైళ్లు ఈ రోజు నుంచి చర్లపల్లి స్టేషన్‌లో ఆగుతాయి. 12072 హింగోళిడెక్కన్-ముంబయి సీఎస్ఎన్ టెర్మినస్ అప్ అండ్ డౌన్ రైళ్లు, పర్చూరు, సెలులో 20701, సికింద్రాబాద్-తిరుపతి అప్ అండ్ డౌన్ రైలు మిర్యాలగూడలో, 17646 రేపల్లె-సికింద్రాబాద్ రామన్నపేటలో ఆగుతాయి. 12787 నర్సాపూర్-నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ 15, 16 తేదీల్లో మహబూబాబాద్‌లో ఆగుతుంది. 17479 పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20న, 17480 తిరుపతి-పూరి ఈ నెల 21న, 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఈ నెల 18న, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ రైళ్లు ఈ నెల 16న కొవ్వూరు స్టేషన్‌లో ఆగుతాయి. 20896 భువనేశ్వర్-రామేశ్వరం రైలు ఈ నెల 21న, 20895 రామేశ్వరం-భువనేశ్వర్ రైలు ఈనెల 23న, 12867 హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23న, 16583 పుదుచ్చేరి-హౌరా ఈ నెల 19వ తేదీన రాజమండ్రి స్టేషన్‌లో ఆగుతాయి. 16583 యశ్వంత్‌పూర్-లాతూర్ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు, 16584 లాతూర్-యశ్వంత్‌పూర్ ఈ నెల 15న కమలానగర్ స్టేషన్‌లో ఆగుతాయి. 22151 పూణే-ఖాజీపేట ఈ నెల 21న, 22152 ఖాజీపేట-పూణే ఈ నెల 23న మంచిర్యాల స్టేషన్‌లో ఆగుతాయని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

వెబ్ ఆప్షన్లు ఇవ్వండి: డీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత డీఎస్సీ శిక్షణకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించినట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక గురువారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించామని తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 75 మంది ఎస్సీ అభ్యర్థులు, 60 మంది ఎస్టీ అభ్యర్థులు మెరిట్ లిస్టులో ఉన్నారని తెలిపారు. https://mdfc.apcfss.in వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితాను ఉంచామని, వీరందరూ జ్ఞానభూమిలో పోర్టల్ లేదా https://mdfc.apcfss.in వెబ్ పోర్టల్‌లో పొందుపరిచిన కోచింగ్ సెంటర్లు అన్నింటికి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోపు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు.

లేపాక్షికి యునెస్కో గుర్తింపునకు కృషి చేయండి

ముఖ్యమంత్రిని కోరిన మైనాస్వామి



ముఖ్యమంత్రికి ఆలయ విశిష్టత చిత్రాలను అందజేస్తున్న మైనాస్వామి

హిందూపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ సంపదగా లేపాక్షి వీరభద్ర ఆలయానికి యునెస్కో గుర్తింపు కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును చరిత్రకారుడు మైనాస్వామి కోరారు. గురువారం ముఖ్యమంత్రిని కలిసి మైనాస్వామి లేపాక్షి ఆలయ విశిష్టతను వివరించారు. యునెస్కో గుర్తింపునకు కావాల్సిన అర్హతలన్నీ ఉన్నాయని తెలిపారు. అందుకు సంబంధించిన ప్రాథమిక నివేదికను సీఎంకి అందించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్యారిస్‌లోని యునెస్కోతో సంప్రదింపులు ప్రారంభించడానికి నిపుణుల కమిటీని నియమించాలని కోరారు. వీరభద్రస్వామి కుడ్య చిత్రం ఆసియాలోనే అతి పెద్దదన్నారు. ఏకశిలా నంది విగ్రహం, ఎత్తైన నాగలింగం, నాట్యమండపంలోని నిలువు శిల్పాలు, అద్భుతమైన తైలవర్ణ చిత్రాలు, ఛాయా చిత్రాలకు సంబంధించి నివేదికలో పొందుపర్చామన్నారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు వస్తే ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు మైనాస్వామి వివరించారు.

వన్య ప్రాణులను రక్షించుకుందాం

డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధి స్వాతి



ఈతోడు అటవీ ప్రాంతంలో చెట్టుకు ఏర్పాటు చేసిన కెమెరా

తనకల్లు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సమష్టిగా వన్యప్రాణులను పరిరక్షించుకుందామని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (ప్రపంచ నిధి) ప్రతినిధి స్వాతి పిలుపునిచ్చారు. మండలంలోని ఈతోడు, చిన్నరామన్నగారిపల్లి, కొక్కంటి గ్రామాల పరిధిలోని అడవుల్లో ఆమె.. గురువారం ప్రజలతో కలిసి పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వన్యప్రాణులు అంతరించిపోతున్నాయన్నారు. ఇప్పటికే ఈప్రాంతంలో తోడేళ్లు కనుమరుగయ్యాయన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ కోసం డబ్ల్యూడబ్ల్యూఎఫ్.. వివిధ స్వచ్ఛంధ సంస్థలు, ప్రజలతో కలిసి పని చేస్తోందన్నారు. అందులో భాగంగానే మండలంలోని ఈతోడు, చిన్నరామన్నగారిపల్లి, కొక్కంటి పాఠశాల ప్రహరీలకు ఈప్రాంతంలోని వన్య ప్రాణుల బొమ్మలను చిత్రీకరించామన్నారు. అడవిలో ఏయే జంతుజాతులున్నాయో తెలుసుకోవడానికి చిన్నరామన్నగారిపల్లి, ఈతోడు అటవీ ప్రాంతాల్లో ఆరు కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా రాత్రి సమయంలో సంచరించే వివిధరకాల అడవి జంతువులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. గుర్తించిన జంతువుల సంరక్షణ, స్థావరాల ఏర్పాటు, వాటి సంతతి పెంపొందేలా చర్యలు చేపడుతున్నామని ఆమె వెల్లడించారు. ఆమెతోపాటు జనజాగృతి ఈడీ రాంప్రసాద్, గ్రామాల ప్రజలు ఉన్నారు.

బంధాలు సరిగా లేక..!

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలలో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో నాలుగు ఘటనలకు కుటుంబ పరమైన గొడవలే కారణం కావడం గమనార్హం. భార్యభర్తల మధ్య సంబంధాలు బెడిసికొట్టడం, మద్యం, వేధింపులు, వివాహేతర సంబంధం.. ఇలా ఏదో ఒక కారణంతో నలుగురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు.

అత్తారింటి వేధింపులతో అల్లుడు..



కేశవ(ఫైల్)

పరిగి మండలం శాసనకోటలో కేశవ(30) అనే వ్యక్తి బుధవారం ఉరివేసుకున్నాడు. ఎస్ఐ రంగుడు యాదవ్ తెలిపిన మేరకు, సోమందేపల్లి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన గుట్టూరు కేశవ నాలుగేళ్ల క్రితం శాసనకోటకు చెందిన శృతిని వివాహం చేసుకున్నాడు. పుట్టింటికి వెళ్లిన భార్య ఎంత బతిమాలినా తిరిగి రాలేదు. దీంతో కేశవ అత్తారింట్లోనే నాలుగేళ్లుగా ఉంటున్నాడు. లారీ డ్రైవర్‌గా పని చేసే కేశవను భార్య శృతి, అత్త, బావమరిది తరచూ వేధించేవారు. అవమానం భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకున్నాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేశవ తండ్రి బాబు ఫిర్యాదు మేరకు శృతి, ఆమె తల్లి, సోదరుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..



శంకర్

భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన శంకర్(46) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ శివరాముడు తెలిపిన మేరకు, ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ సిద్ధన్నగారిపల్లికి చెందిన శంకర్.. ఆయన భార్య తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లారు. కాపురానికి తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన శంకర్.. బుధవారం రాత్రి రాళ్ళ అనంతపురం - సిద్ధన్నగారిపల్లి రోడ్డు మధ్యలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. శంకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై..



రమేష్

నార్పల లోని శక్తినగర్ కాలనీలో రొట్టెల రమేష్(39) అనే వ్యక్తి ఉరివేసుకున్నాడు. రమేష్ మద్యానికి బానిసై తరచూ భార్య, తండ్రితో గొడవపడేవాడు. మద్యం అలవాటు మానుకోవాలని వారు చెప్పినా వినుకోలేదు. ఈ క్రమంలో బుధవారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో లోపల గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

వివాహేతర సంబంధం ఉందని..



నంజుండ

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో బుధవారం రాత్రి నంజుండ(33) ఉరి వేసుకున్నాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు, నంజుండ బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన భార్యకు వివాహేతర సంబంధం ఉందని మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుమారుడు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు కిందకు దించి, పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తన సోదరుడి ఆత్మహత్యకు అతని భార్య నాగవేణి, సీపీఎం రమేష్ కారణమని నంజుండ సోదరుడు ముత్యాలప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీతోట ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో యువకుడు..



షెక్షావలి (ఫైల్)

ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ సమీపంలో గురువారం తెల్లవారుజామున రైలు కింద పడి షెక్షావలి (24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు, కాలనీకి చెందిన అబ్దుల్ ఖాదర్‌వలీ కుమారుడు షెక్షావలి నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో తాను చనిపోతానని మూడు రోజులుగా తల్లిదండ్రులకు చెబుతుండేవాడు. నయమవుతుందని వారు ధైర్యం చెప్పేవారు. ఈ క్రమంలో రైలుకింద పడ్డాడు. మృతదేహాన్ని నాందేడ్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ గమనించి, హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

అనంతపురం సెంట్రల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): జర్మనీలో ఉద్యోగం చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. మెకట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఎనర్జీ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులన్నారు. జర్మన్ భాషపై శిక్షణ, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశామన్నారు. జర్మన్ భాషపై రాష్ట్రంలో ఆన్‌లైన్ శిక్షణ పూర్తిచేసిన వారికి రెండో విడతగా దేశస్థాయిలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం మైగ్రేషన్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల వయసులోపు వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోగా naipunya m.ap.gov.in/programregistration పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9988 853335, 8712655686, 8790118349, 8790117279 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు మూడేళ్ల జైలు

అనంతపురం క్రైం,మార్చి 13(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులకు గురిచేసి భార్యను ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. ఈ మేరకు గురువారం మహిళా కోర్టు సెషన్స్ న్యాయాధికారి శోభారాణి తీర్పు వెలువరించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం మదిగుబ్బకు చెందిన జింకల పోతన్నకు పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన అనూషతో వివాహమైంది. వివాహ సమయంలో రూ.లక్ష నగదు, 15 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. ఏడాది పాటు అన్యోన్యంగా ఉన్నా, మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న పోతన్న భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. వేధింపులు భరించలేక 2018 ఫిబ్రవరి 7వ తేదీ అనూష ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఆత్మకూరు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేయగా, డీఎస్పీ వెంకటరావు దర్యాప్తు చేసి మహిళా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయాధికారి శోభారాణి ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సుజన వాదించారు. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ వెంకటేష్ నాయక్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ శౌ రెడ్డి, కానిస్టేబుల్ షెక్షావలి సాక్షులను సకాలంలో కోర్టులో హాజరపరిచినందుకు ఎస్పీ జగదీష్ అభినందించారు.

హనుమంత వాహనంపై దేవదేవుడు

భక్తులను అనుగ్రహించిన కోనేటి రాయుడు



హనుమంతువాహనంపై శ్రీవారు

కదిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి గురువారం హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయం నిత్యపూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. త్రేతా యుగంలో రామలక్ష్మణలను తన భుజస్కందాలపై మోసిన హనుమంతుడు.. కలియుగంలో నారసింహుడికి వాహనంగా మారి, తన కోరికను తీర్చుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. విద్యుద్దీపాల వెలుగులు, మల్లెల సౌరభాల నడుమ తిరువీధుల్లో విహరించిన స్వామివారిని దర్శించుకోవడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. నారసింహుడి నామస్మరణతో కదిరి వీధులు మార్మోగాయి. వేడుకలలో ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మగరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారికి బ్రహ్మగరుడ సేవ నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతున్ని నారసింహుడికి వాహనంగా పంపుతారని, అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మగరుడ సేవ అని పిలుస్తారని వేద పండితులు చెబుతారు. స్వామివారికి ఉదయం నిత్య పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. సంధ్యా సమంలో గరుడ దండం ప్రతిష్టించి, శ్రీవారిని తిరువీధుల్లో ఊరేగిస్తారు. కొక్కంటి పాల్లెగాళ్లు శనివారం నుంచి శ్రీవారి సేవలో భాగస్వాములై దివిటీని మోస్తారు.



శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

నేర రహిత జిల్లాగా మార్చుదాం

మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి: ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

హిందూపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాను నేరరహితంగా మార్చుదామనీ, ఇందులో మహిళల పాత్ర కీలకమని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని అప్పలకుంట క్రాస్ వద్దగల కల్యాణమండపంలో గురువారం మహిళా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హిందూపురం అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి లలితాలక్ష్మి, ఎస్పీ హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ... చైతన్యంతోనే మహిళలు సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కుటుంబం చాలా శక్తివంతమైనదనీ, దానిని కాపాడుకోవాలన్నారు. నేరాలకు పాల్పడితే చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. ప్రతి మహిళ, బాలికలు మొబైల్ ఫోనులో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి లలితాలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు ఇప్పుడిప్పుడే ఉద్యోగాల కోసం బయటకు వచ్చి పురుషులతో సమానంగా రాణిస్తున్నా రన్నారు. ఉద్యోగాలు చేసే ప్రాంతాల్లో మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. చట్టాలను తెలుసుకోవాలన్నారు. ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అనంతరం బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీడీపీఓ శాంతి, సీఐలు ఆంజనేయులు, జనార్దన్, కరీమ్, మహిళలు పాల్గొన్నారు.

తప్పు చేస్తే ఉపేక్షించను: ఆర్జేడీ



మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

అనంతపురం విద్య, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్స్, స్పాట్ వాల్యుయేషన్‌లో తప్పు జరిగితే ఉపేక్షించేది లేదని పాఠశాల విద్య కడప ఆర్జేడీ శామ్యూల్ హెచ్చరించారు. బాగా చదివి రాసిన విద్యార్థులకు న్యాయం జరగాలని ఆయన అన్నారు. రాయలసీమ జోన్ 10వ తరగతి పరీక్షల కోడింగ్, అసిస్టెంట్ కోడింగ్ అధికారులకు రాయలసీమ జిల్లాల డీఈఓలతో కలసి ఆయన సైన్స్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. డీఈఓలు, ఏసీలు ప్రత్యేక దృష్టి పెట్టి ఎక్కడా కాపీయింగ్ జరగకుండా చూడాలని అన్నారు. పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు పకడ్బందీగా, నిజాయతీగా వ్యవహరించాలని సూచించారు. రాసిన విద్యార్థులకు, రాయని విద్యార్థులకు ఒకే తరహా మార్కులు రాకుండా చూడాలని అన్నారు. స్పాట్‌లో పనిచేసే అధికారులు చదివిన పిల్లలకు న్యాయం జరగాలన్న ఆలోచనతో ఉండాలని సూచించారు. ఏ జిల్లాలోనైనా డీఈఓలు, ఏసీలు ఉపేక్షిస్తే వెంటనే తన దృష్టికి తేవాలని సూచించారు. తనకు చిన్న మెసేజ్ పంపినా వెంటనే స్పందిస్తానని అన్నారు. స్పాట్ వాల్యుయేషన్ సమయంలో ఎవరూ సెల్ ఫోన్ వాడకుండా చర్యలు తీసుకోవాలని డీఈఓలు, ఏసీలను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు డీఈఓ శామ్యూల్, అన్నమయ్య డీఈఓ సుబ్రమణ్యం, కడప డీఈఓ, ఏసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫలితాల తరువాత సమీక్షలతో ప్రయోజనం లేదు

పదో తరగతి పరీక్షల ఫలితాల తర్వాత సమీక్షలు పెట్టినా ప్రయోజనం ఉండదని, పరీక్షల్లోనే నిజాయతీగా పనిచేయాలని ఆర్జేడీ సూచించారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, పరీక్షల వేళ ఆత్మసాక్షితో పనిచేయాలని సూచించారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల మీటింగ్ హాల్‌లో సీఎస్, డీఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. మంచి సమాజ నిర్మాణం ఒక్క విద్యాశాఖ వల్లే సాధ్యమవుతుందని అన్నారు. పరీక్షలలో తప్పులు జరగకుండా చూడాలని అన్నారు. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ హాజరయ్యారు.

చీనీ కాయలు టన్ను రూ.25 వేలు

అనంతపురంరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.25,630, కనిష్ఠంగా రూ.2,800, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 233టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

18న ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సచివాలయాలలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు వైద్యశాఖ ముహూర్తం ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 205 మందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారు. అర్హుల జాబితాను గురువారం డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి విడుదల చేశారు. ఈ నెల 18న కౌన్సెలింగ్ నిర్వహించి, స్థానాలను కేటాయిస్తారు. కొత్త స్థానాల్లో విధులలో చేరి, రిలీవ్ కావాలని, తిరిగి ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లోనే విధులు నిర్వహించాల్సి ఉంటుందని డీఎంహెచ్ఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పీహెచ్ సర్టిఫికెట్లు పెట్టిన వారిని పరిశీలన కోసం మెడికల్ బోర్డుకు రెఫర్ చేశామని డీఎంహెచ్ఓ తెలిపారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం మార్కెట్‌కు 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7 కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి



సత్యనారాయణ(ఫైల్)

అనంతపురం క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అరటి పంట సాగు చేసి నష్టపోయిన రైతు సత్యనారాయణ(40) ఆత్మహత్యాయత్నం చేశారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు, పుట్లూరు మండలం ఓబుళాపురానికి చెందిన సత్యనారాయణ ఐదెకరాలలో అరటిపంట సాగు చేశారు. పంట దిగుబడి సరిగా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. రూ.15 లక్షలు వరకు అప్పులు పేరుకుపోయాయి. దీంతో ఈ నెల 11న ఇంట్లో చెప్పి అనంతపురం వచ్చి, నవ్య లాడ్జిలో ఓ గది అద్దెకు తీసుకున్నారు. అదే రోజు అర్ధరాత్రి విషం తాగారు. ఈ నెల 12న భార్య విజయలక్ష్మి ఫోన్ చేసినా స్పందించలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చి లాడ్జి గదిలో చూసేసరికి అపస్మారక స్థితిలో కనిపించారు. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. రైతు మృతితో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుపై దాడికి యత్నించిన చిరుత

కంబదూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలను చిరుత భయపెడుతోంది. భీములకుంట రోడ్డు సమీపంలో ఉన్న కొండలో చిరుత సంచరిస్తోంది. కంబదూరుకు చెందిన రైతు నరసింహులుపై గురువారం తెల్లవారుజామున దాడికి యత్నించింది. ద్విచక్రవాహనంలో తోటకు వెళుతుండగా పొదల నుంచి ఒక్కసారిగా అడ్డు వచ్చింది. దీంతో రైతు భయపడి ద్విచక్రవాహనాన్ని వదిలేసి కేకలు వేస్తూ పరుగుపెట్టారు. చుట్టుపక్కల రైతులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో చిరుత కొండలోకి పారిపోయింది. ఇటీవల ఈ కొండ ప్రాంతంలో చిరుత, ఎలుగుబంట్ల సంచారం, దాడులు పెరిగిపోయాయి. రైతులు పొలాల్లోకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. అటవీశాఖ అధికారులు స్పందించి, రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పరిటాల సునీతకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం ఎమ్మెల్యే పరిటాల సునీత తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

వీర ఓబమ్మదేవి దిబ్బాలు మహోత్సవం ప్రారంభం



అలంకరణలో అమ్మవారు

రామగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమేకలపల్లి గ్రామంలో వెలసిన వీర ఓబమ్మ, లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో వీర ఓబమ్మ దిబ్బాలు మహోత్సవం గురువారం ప్రారంభమైంది. పూల బండు కార్యక్రమంతో ప్రారంభించగా పాల కావళ్లు రామగిరి, కురాకులపల్లి తదితర గ్రామాల నుంచి ఆలయానికి చేరుకున్నాయి. రామగిరి నుంచి అక్కమ్మ గార్లు సిద్ధేశ్వరస్వామి, నరసింహస్వామి విగ్రహాలను ఊరేగింపుగా గరిమేకలపల్లి గ్రామానికి తీసుకొచ్చారు. కురాకులపల్లి నుంచి శాస్త్రపల్లెమ్మ, వీర పాపయ్యస్వాములను తీసుకువచ్చి వీర ఓబయ్యస్వాములను గ్రామానికిచేర్చారు. శుక్రవారం దిబ్బాలు మహాపూజా కార్యక్రమంతోపాటు ఉట్లపరుష నిర్వహిస్తున్నట్లు ఆలయ పెద్దలు తెలిపారు.

వైభవంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

అనంతపురం కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆదిమూర్తినగర్‌లోని షిర్డిసాయి బాబా ఆలయ 24వ వార్షికోత్సవ వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. సాయినాథుని మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి సాయినాథుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహామంగళహారతి నివేదనానంతరం దాదాపు 2వేల మందికి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వైకుంఠం జయచంద్రచౌదరి, వెంకటస్వామి, నాగానందం, రాఘవేంద్ర గుప్త, రవీంద్రనాథ్, భార్గవసాయి పాల్గొన్నారు.

కనకదాస సన్నిధిలో..



కనకదాస చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

రాప్తాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కురుబ కులస్థుల ఆధ్వర్యంలో కనకదాస విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది కావడంతో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కనకదాస విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. గురువారం రాత్రి కనకదాస చిత్రపటాన్ని డప్పు వాయిద్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ స్వామి వ్రతం

అనంతపురం కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఫాల్గుణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం శారదానగర్‌లోని శివకోటి దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రతమండపాన్ని విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనారోగ్యం

రాప్తాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు వస్తాయని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ తెలిపారు. పంగల్ రోడ్డు సమీపంలోని కేజీబీవీలో గురువారం బాల్య వివాహాలు, చిన్న వయసులో గర్భం దాల్చడం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేజీబీవీ ఎస్ఓ ముత్యాలమ్మ, వైద్య సిబ్బంది అరుణ, నారాయణస్వామి, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి జూడో పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో సబ్‌జూనియర్ పోటీలు 15వతేదీ నుంచి విజయవాడలో నిర్వహించనున్నట్లు జూడో అసోసియేషన్ జిల్లా కన్వీనర్ గోవిందు తెలిపారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మాజీ కార్పొరేటర్, టీడీపీ నాయకుడు పావురాల చంద్రశేఖర్ అభినందించారు. ఎంపికైన వారిలో బాలుర విభాగంలో చిన్న, సంతోష్, తేజ, మహ్మద్‌గౌస్, గోవర్ధన్, సంతోష్, ఎకరాలికి, రంగస్వామి ఉన్నారు. బాలికలలో నందిని, మేఘన, వైష్ణవి, నాగమణి, జ్యోత్స్న, మమతసాయి, చిన్ని ఉన్నారు. కార్యక్రమంలో జూడో అసోసియేషన్ జిల్లా కో-కన్వీనర్లు విక్టర్, రామాంజనేయులు, కోచ్ రేవతి, మేనేజర్ దేవేంద్ర నాయక్, సీనియర్ క్రీడాకారులు సుధాకర్, వరప్రసాద్ పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయం

అనంతపురంరూరల్,మార్చి13(ఆంధ్రజ్యోతి): జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని బెంగళూరు గార్ప్స్ గ్రేస్ మినిస్ట్రీస్ పాస్టర్ బెంజిమెన్, నల్గొండ జిల్లా ఐఎఫ్‌జే పాస్టర్ మార్టిన్ అన్నారు. గురువారం మండలంలోని రాచానపల్లిలో ఉన్న యేసుకృపామందిరంలో జిల్లా అధ్యక్షులు నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన అసోయేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బెంజిమెన్, మార్టిన్ హాజరయ్యారు. దైవజనులందరితో దేశ, రాష్ట్ర, జిల్లా సంక్షేమం, ఉజ్జీవం కోసం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథుల చేతుల మీదుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో చర్చి మరమ్మతులకు, పాస్టర్ల వైద్య సహాయం నిమిత్తం పలువురు పాస్టర్లకు ఆర్థిక సాయం చేశారు. అసోయేషన్ వైస్ ప్రెసిడెంట్ మార్క్, కార్యదర్శి ఆనంద్, జాయింట్ సెక్రటరీ మనషే, జీవన్‌బాబు, జహంగీర్‌జాషువా, లాబాన్ సుధాకర్, విజయ్ సింహా, చార్లెస్ నాయక్ పాల్గొన్నారు.



పాస్టర్లకు ఆర్థికసాయం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఐదేళ్లుగా కదలని మురుగు..!

- ఇబ్బంది పడుతున్న హౌసింగ్ బోర్డు వాసులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ఆర్టీఓ కార్యాలయం రోడ్డులోని ప్రధాన మురుగుకాలువ దుస్థితి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా కాలవను శుభ్రం చేయలేదు, మురుగు తీయలేదు. ఇదెక్కడో మారుమూల గ్రామాల్లోని పరిస్థితి కాదు.అనంతపురం నగరంలోని దుస్థితి. హౌసింగ్‌బోర్డులో ఉన్న ఆర్టీఓ కార్యాలయం ప్రధాన రోడ్డులో ఉన్న మురుగు కాలవ పరిస్థితి అంతా ఇంతా కాదు. ఐదేళ్లుగా కనీసం మురుగు తీయలేదు, చెత్తతొలగించలేదు. ఇదే రోడ్డులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఆర్టీఓ కార్యాలయం, జేఎన్‌టీయూ, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు ఇతర కార్యాలయాలకు, కాలనీలకు వెళ్తుంటారు. అయినా ఈ రోడ్డులో ఉన్న మురుగుకాలవను ఎవరూ శుభ్రం చేయడం లేదని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు.

ఐదేళ్లుగా చెబుతున్నా పట్టించుకోలేదు
- శ్రీనివాసులు, హౌసింగ్‌బోర్డు



ఐదేళ్ల నుంచి మున్సిపల్ అధికారులు, నాయకులకు, పారిశుధ్యకార్మికులకు చెబుతున్నా ఎవరూ కాలువను శుభ్రం చేయలేదు. దీంతో ఓ వైపు మురుగు, మరోవైపు చెత్త పేరుకుపోయి కాలవ నుంచి దుర్వాసన వస్తోంది. ఇప్పటికే పలుమార్లు దుర్వాసన, దుర్గంధంతో రోగాల బారిన పడ్డాం. మెయిన్ రోడ్డులోనే పరిస్థితి ఇలా ఉంటే మరి ఇతర ప్రాంతాల్లో ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. కాలవను శుభ్రం చేయాలని ఎవరిని అడగాలో, ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు.

శ్రీరంగరాయుని చెరువుకు నీరు కేటాయించాలి

శింగనమల మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్దదైన శ్రీరంగయని చెరువుకు హంద్రీనీవా ద్వారా ఒక టీఎంసీ నీటిని కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నప్ప యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ చెరువులో నీరుంటే 40 గ్రామాలకు తాగు, సాగు నీరు అందుతాయన్నారు. చెరువు ఆయకట్టు కింద పంటలు సాగు చేస్తే పశుగ్రాసం సమస్యతోపాటు కూలీలకు పనులు ఉంటాయన్నారు. దాదాపు 350 మత్స్యకార కుటుంబాలు లబ్ధిపొందుతాయని, అధికారులు స్పందించి చెరువుకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని కోరారు. మధుయాదవ్, నేసేమధు,మధురెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏడీసీసీ బ్యాంకులో ఘనంగా జరుపుకున్నారు. గురువారం స్థానిక సుభాష్‌రోడ్డులోని ఎన్టీఆర్ సహకారభవన్‌లో బ్యాంకు మహిళా ఉద్యోగుల విభాగం ఆధ్వర్యంలో జిల్లా సహకార అధికారి (డీసీఓ) అరుణకుమారి, సీఈఓ సురేఖరాణి చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. బ్యాంకు మహిళా మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాల్సిందే: తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురంరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెఎస్సార్ కాలనీలో ఆక్రమణకుగురైన ప్రభుత్వ స్థలంలో వేసిన షెడ్లను తొలగించాలని తహసీల్దార్ మోహన్‌కుమార్ సదరు వ్యక్తులకు సూచించారు. ఆ మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కురుగుంట గ్రామ సర్వే నెంబరు91లో ఉన్న 30సెంట్ల ప్రభుత్వ భూమిని స్థానిక వైసీపీ నాయకుడు ఆక్రమించిన విషయం విదితమే. దీనిపై యథేచ్ఛగా ఆక్రమణ అన్న శ్రీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ ఆక్రమణకు గురైన స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఆక్రమణదారులను పిలిపించి మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలో షెడ్లు ఏవిధంగా వేశారు. రెవెన్యూ పరంగా ఎలాంటి కేటాయింపులైనా ఉన్నాయని వ్యక్తులను ప్రశ్నించారు. ఇందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆక్రమణదారులు తహసీల్దార్‌కు వివరించారు.

రేపు రామగిరిలో ప్రజాదర్బార్

రామగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండలకన్వీనర్ సుధాకర్, ప్రధానకార్యదర్శి మారుతిప్రసాద్, తెలుగుయువత మండల అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాదర్బార్‌కు ఎమ్మెల్యే పరిటాలసునీత హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు అందించి పరిష్కారించుకోవాలని వారు కోరారు. అలాగే శుక్రవారం రామగిరిలో జరుగుతున్న దీన్‌దయాల్ శ్రవణఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి సమస్యలు ఉన్నవారి పరీక్షకేంద్రాన్ని పరిశీలించి ఉచితంగా వినికిడి పరికరాలను ఎమ్మెల్యే పంపిణీ చేస్తారన్నారు.

ఉనికి కోసమే వైసీపీ యువత పోరు

కనగానపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉనికి కోసమే యువత పోరు పేరుతో వైసీపీ నాయకులు యువత లేని పోరు చేపట్టారని తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బట్టా సురేష్‌చౌదరి, మల్లెల చైతన్య విమర్శించారు. స్థానిక పరిటాల భవన్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ బకాయిలు పెట్టిన వారే నేడు ధర్నాల పేరుతో యువతపోరు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్‌లో ఉన్న బకాయిలను కాలేజీ యాజామాన్యానికి చెల్లించారన్నారు. సర్పంచ్ అంకే రామక్రిష్ణ, చల్లా బాలక్రిష్ణ, సోము పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణపై అవగాహన

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించే మెగా డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణపై అధికారులు అవగాహన కల్పించారు. గురువారం బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ సుమన జయంతి ఆదేశాల మేరకు కో-ఆర్డినేటర్ రవీంద్ర నగరంలోని సప్తగిరి సర్కిల్లోని సెంట్రల్ లైబ్రరీ, రైతుబజారు సమీపంలోని మహిళా గంథాలయంలో అవగాహన కల్పించారు.

సీపీఎస్ ఉద్యోగులపై కేసుల ఎత్తివేత హర్షణీయం

అనంతపురం విద్య, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం టీచర్లు, సీపీఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటించడం హర్షణీయమని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 2022 సెప్టెంబరు 1న నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా టీచర్లు నిరసన తెలిపితే గత ప్రభుత్వం అణచివేయడమేకాకుండా అడ్డగోలుగా, అక్రమంగా కేసులు పెట్టిందన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు విత్తన దుకాణాల్లో ఏడీఏ రవి, అనంతపురం ఏఓ శశికళ గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శ్రావణి సీడ్స్, శ్రీ భవానీ ఏజెన్సీ, రేవతి సీడ్స్, సాయి బాలాజీ ట్రేడర్స్ తదితర దుకాణాలను పరిశీలించారు. విత్తనాల స్టాక్‌తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఆయా దుకాణాల్లో రూ.46 లక్షల విలువైన బీఏఎస్ఎఫ్ కళింగర రకం విత్తనాలు సీజ్ చేసి, అమ్మకాన్ని నిలుపుదల చేశారు. ఇందులో శ్రావణి సీడ్స్‌లో రూ.26 లక్షల విలువైన విత్తనాలు సీజ్ చేశారు. బత్తలపల్లి మండలానికి చెందిన రైతు మురళీ ఆత్మహత్యాయత్నం చేసుకున్న నేపథ్యంలో విత్తనాల శాంపుల్స్ తీసి, పరీక్షకు పంపామన్నారు. పరీక్ష ఫలితాల ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని ఏడీఏ రవి స్పష్టం చేశారు. అనంతరం బాధిత రైతు మురళీని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడీఏ రవి పరామర్శించారు. ఏదైనా సమస్య ఉంటే స్థానిక వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలని, ఇలా ఆత్మహత్య చేసుకోకూడదని సూచించారు.

నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం
● కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలకు కలెక్టరు వినోద్‌కుమార్ సూచించారు. గురువారం రేడియోస్టేషన్‌లో అనంతమిత్ర ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 17మంది కలెక్టరుతో ఫోన్‌లో మాట్లాడుతూ పలుసమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ వాహనాల్లో ప్రయాణించే ప్రతిఒక్కరు హెల్మెట్, సీట్‌బెల్ట్ వేసుకొని సురక్షితంగా ప్రయాణం చేయాలని సూచించారు. అలాగే వాహనాలు నడిపేవారందరూ డ్రైవింగ్‌లైసెన్స్‌తీసుకోవాలన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రావణి సీడ్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నాసిరకం కళింగర విత్తనాలు విక్రయించిన విత్తన దుకాణం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో టెక్నికల్ ఏఓ రాకేష్ నాయక్‌కు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు వినతి పత్రం అందజేశారు. బత్తలపల్లి మండలం చెర్లోపల్లికి చెందిన రైతు మురళీకి అనంతపురం నగరంలోని శ్రావణి సీడ్స్ నిర్వాహకులు నకిలీ కళింగర విత్తనాలు విక్రయించడంతో భారీగా నష్టపోయాడన్నారు. శ్రావణి సీడ్స్ షాపు వద్దకు వెళ్లి తాను నష్టపోయినట్లు చెప్పినా అవమానరకంగా మాట్లాడటంతో తనకు న్యాయం జరగదన్న ఆవేదనతో ఆత్మహత్యయత్నం చేశాడన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించండి: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పంచాయతీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజ నాయుడు అన్నారు. గురువారం సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడో శనివారం జరిగే స్వచ్ఛదివస్ కార్యక్రమంలో 15న అన్ని పంచాయతీ స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.

వనమిత్ర స్థలం ఆక్రమణలకు అవకాశం లేదు: డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న వనమిత్ర అటవీశాఖకు సంబంధించి స్థలం ఆక్రమణలకు గురి కావడానికి అవకాశం లేదని, వేంటనే మండల సర్వేయర్‌ను పిలిపించి సర్వే చేయించి అందుకు అనుగుణంగా హద్దులు ఏర్పాటు చేయాలని జిల్లా అటవీశాఖాధికారి విఘ్నేష్ రేంజర్ శ్రీనివాసులుకు సూచించారు. గురువారం రేంజర్ శ్రీనివాసులు ఇతర సిబ్బందితో కలిసి డీఎఫ్ఓ విఘ్నేష్ వనమిత్రలో ఆక్రమణలకు గురి అవుతున్న స్థలాన్ని పరిశీలించారు. స్పందించిన ఆయన అటవీశాఖ స్థలం ఆక్రమణలకు గురి కావడానికి అవకాశం లేదన్నారు. వేంటనే మండల సర్వేయర్‌ను పిలించి సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైసీపీ యువత పోరు అట్టర్ ఫ్లాప్

అనంతపురం అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టిన యువత పోరు అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వాల్మీకి కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీఎల్ఎన్ మూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేరును విద్యాదీవెనగా పేరు మార్చడం తప్పా చేసిందేమీ లేదన్నారు.

అబుల్ కలాం విగ్రహాన్ని ఎందుకు పెట్టించలేదు?

- టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుల నిలదీత



మాట్లాడుతున్న టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అబుల్ కలాం విగ్రహాన్ని నాలుగేళ్లుగా ఎందుకు పెట్టించలేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని ఆ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు నిలదీశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మైనార్టీ నాయకులు ఫిరోజ్ అహ్మద్, ముక్తియార్, సైపుద్దీన్, ఇస్మాయిల్, జేఎం బాషా, ముస్తాక్ మీడియాతో మాట్లాడారు. మైనార్టీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో అబుల్ కలాం విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేస్తే బాగుంటుందని తామే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కొత్త విగ్రహం తెప్పిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి చెప్పగా.. అంత సమయం లేదని రోడ్డు విస్తరణలో తొలగించిన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే అధికారులను ఆదేశించి, 11 రోజుల్లోనే విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించేలా చర్యలు తీసుకున్నారన్నారు. విగ్రహాన్ని తొలగించి నాలుగేళ్లు అయినా ఎందుకు ఏర్పాటు చేయించలేకపోయారని ప్రభాకర్ చౌదరిని ప్రశ్నించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని, ఇకనుంచైనా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు.

పాత పద్ధతిలోనే పన్ను వసూళ్లకు చర్యలు చేపట్టాలి

అనంతపురం కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అద్దె విలువ ఆధారంగా పాతపద్ధతిలో పన్నులు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని ఏపీ పట్టణ పౌరసంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జేవీవీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ రసూల్, ఏజి రాజమోహన్, ఉపాధ్యక్షుడు ఎంఎస్‌టీ రాజు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపుతున్న లేఖను ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఆస్తిపన్ను పెంపుదలకు మున్సిపల్ సవరణ చట్టం 44-2020 సవరించి ఆస్తివిలువ ఆధారంగా పన్ను వసూలు చేసేందుకు యత్నించిందన్నారు. అపుడు పౌర సంఘాలుగా అనేక నిరసనలు, ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోవడంవల్ల కోర్టులో పిటిషన్లు కూడా వేశారన్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు కూడా ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశాయని, తాము అధికారంలోకి వస్తే చట్టాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చాయని గుర్తు చేశారు. అసెంబ్లీ సమావేశంలో ఆర్డినెన్స్ చేసి 44-2020 చట్టాన్ని రద్దు చేయాలని కోరారు.



సీఎంకు రాసిన లేఖను ప్రదర్శిస్తున్న పట్టణ పౌరసంఘాల నేతలు

ఎస్సీల అభివృద్ధికి సహకరించండి

మంత్రికి ఎమ్మెల్యే శ్రావణి వినతి



శింగనమల మార్చి 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎస్సీల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి విన్నవించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. ఎస్సీ కాలనీలు, వసతి గృహాల్లో సమస్యలపై మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ఎస్సీ వసతి గృహాలలో సౌకర్యాలు కల్పనకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పోలీస్ స్టేషన్లలో సౌకర్యాలు కల్పించండి

నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లలో సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చూయాలని హోంమంత్రి అనితను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. బుధవారం సచివాలయంలోని హోంమంత్రి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని శింగనమల, పుట్లూరు పోలీసు స్టేషన్లకు శింగనమల సర్కిల్ కార్యాలయం కొత్త భవనాలను నిర్మించాలని కోరారు.

వినికిడిలోపం శాపంగా మారకూడదు: పరిటాల శ్రీరామ్



వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్న పరిటాల శ్రీరామ్

రామగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వినికిడిలోపం శాపంగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. గురువారం స్థానిక పరిటాల రవీంద్ర ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక క్యాంప్‌నకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వినికిడిశక్తిలేని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వినికిడి యంత్రాలను అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు వినికిడిలోపం శాపంగా మారకుండా దీన్‌దయాల్ శ్రవణ ఫౌండేషన్ చేస్తున్న కృషి గొప్పదన్నారు. ఈ క్యాంప్ రెండు రోజులు ఉంటుందని వినికిడి లోపం ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు,సోలార్ ఎనర్జీ లిమిటెడ్ డీజీఎం వెంకటేశ్, అమర్‌రాజ మేనేజర్ అరవిందు, సాక్ష్యం జిల్లా కన్వీనర్ పవన్, మెడికల్ ఆఫీసర్ సోలమన్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ క్రిష్ణకిశోర్, టీడీపీ నాయకుడు రామ్మూర్తినాయుడు, శ్రీనాథ్, మారుతీప్రసాద్, శ్రీదర్‌నాయుడు, శ్రీనివాసులు,ఎస్ అంజనేయులు, పూజారి అక్కులప్ప, పేపర్ శీన పాల్గొన్నారు.

మీరే ఫీజు బకాయిలు పెట్టి.. నిరసనలు చేస్తారా..?
● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మీరే ఫీజు బకాయిలు పెట్టి.. ఇప్పుడు నిరసనలు చేస్తారా..? అంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు ఘోరంగా ఓడించిన తర్వాత ఉనికికోసం ఇలాంటి పెయిడ్ నిరసనలు చేస్తున్నారన్నారు. మీ పాలనలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం పెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిల్లో ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.788 కోట్లు చెల్లించిందన్నారు. మిగతా బకాయిలను విడతల వారిగా చెల్లిస్తుందన్నారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసి, ఖజానాను ఖాళీ చేసిందన్నారు. 11 సీట్లతో ప్రజలు వైసీపీకి బుద్ధిచెప్పినా వారిలో మార్పు రాలేదన్నారు. యువత పోరు పేరుతో జగన్‌రెడ్డి వీధినాటకాలు ఆడటం పద్ధతి కాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో కొందరు నాయకులు తమ స్థాయిని మరిచి సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్‌లపై ఇష్టానుసారంగా మాట్లాడటం తగదన్నారు.

బిల్లు చెల్లించమన్నది మీరు కాదా?: మేయర్

అనంతపురం క్రైం,మార్చి 13(ఆంధ్రజ్యోతి): 'డంపింగ్ యార్డ్ బిల్లు చెల్లించమని మీరు చెబితే.... విచారణ తరువాతే బిల్లు చెల్లిస్తామ'ని చెప్పింది వాస్తవం కాదా అని నగర మేయర్ వసీం అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను ప్రశ్నించారు. గురువారం మేయర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. డంప్‌యార్డ్‌లో అవినీతి జరిగిందని, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మేయర్ వసీంను అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని చేసిన వ్యాఖ్యలను మేయర్ ఖండించారు. వైసీపీ హయాంలో రూ.5.36కోట్లు బిల్లులు కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.4.22కోట్లు బిల్లులు చెల్లించారన్నారు. నిజంగా అవినీతి జరిగి ఉంటే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లులు ఎలా చెల్లించారని ప్రశ్నించారు. నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు నరసింహులు, సాకే చంద్రలేఖ, కమల్‌భూషణ్, లావణ్య, చింతకుంట మధు పాల్గొన్నారు.

యువతకు ప్రాధాన్యం ఇవ్వండి

శింగనమల మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సయమంలో టీడీపీ కోసం కష్టపడిన యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలుగుయువత మాజీ కార్యదర్శి కాయల రాజశేఖర్‌యాదవ్ కోరారు. విజయవాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన కలిశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేందుకు యువత కీలకమని, పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

రజకులను గ్రామ బహిష్కరించడం దుర్మార్గం

అనంతపురం సెంట్రల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రజకులను గ్రామంనుంచి బహిష్కరించడం దుర్మార్గమైన చర్య అని రజక సంఘాల పోరాట సమితి కోకన్వీనర్ హనుమన్న మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో రజక కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేశారన్నారు. చిడిపి గ్రామ చెరువుకు సంబంధించిన 1.24 ఎకరాలను రజకులు 50 సంవత్సరాలుగా గ్రామపంచాయతీ కౌలుతో అనుభవిస్తున్నారని తెలిపారు. ఆ స్థలాన్ని గౌడ సామాజికవర్గానికి చెందిన వారు ఆక్రమించడంతో రజకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. దీంతో కక్షపెంచుకున్న గౌడ సామాజిక వర్గ కుటుంబాలు సమాజం సిగ్గుపడేలా గ్రామ బహిష్కరణ చేయడం అన్యాయమని వాపోయారు.

చీనీ చెట్లు దగ్ధం

గార్లదిన్నె మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచర్ల గ్రామంలో ఉన్న రైతు సుంకులమ్మ, పూజారి మారెన్నకు చెందిన చీనీచెట్లు డ్రిప్పు వైరు,పైపులు దగ్ధం కావడంతో రూ.4 లక్షలు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన సుంకులమ్మ పూజారి మారెన్న తనకున్న మూడుఎకరాల్లో చీనీ తోట సాగుచేస్తున్నారు. ప్రస్తుతం చీనీ కాయలు కోత కోయాల్సి ఉంది. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తోటకు నిప్పుపెట్టడంతో కొన్ని చెట్లు డ్రిప్పు పైపులు కాలిపోయాయి. రూ.4లక్షలు నష్టం వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించి, నష్టం అంచనా వేశారు..

భూ కబ్జా కేసులో ముగ్గురి అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నగరంలో భూ కబ్జాలకు పాల్పడిన కేసులో జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు... ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. నగరంలోని లెక్చరర్స్ కాలనీలో ఓ ప్రైవేట్ భూమిలో ప్రహరీని ధ్వంసం చేసి దౌర్జన్యంగా తాత్కాలిక గుడిసెలు వేసి భూకబ్జాలకు పాల్పడిన కేసులో శింగనమల మండలం తరిమెలకు చెందిన గట్టు రామాంజనేయులు, నగరంలోని ముత్యాలమ్మ కాలనీకి చెందిన రామాంజినమ్మ అలియాస్ రమాదేవిని, తాడిమర్రి మండలం పెద్దకోట్లకు చెందిన రాములమ్మ అలియాస్ లక్ష్మిలను అరెస్ట్ చేశామన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గత నెల 2వ తేదీ రాత్రి గట్టు రామాంజనేయులు ఆధ్వర్యంలో తాడిపత్రి పట్టణంలో నివసించే చదళ్ల సత్యనారాయణరెడ్డికి చెందిన సర్వే నెంబరు 95/2ఏలోని 66 సెంట్ల భూమిలోకి అక్రమంగా ప్రవేశించి ప్రహరీగోడను ధ్వంసం చేసి తాత్కాలిక గుడిసెలను నిర్మించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

ప్లాస్టిక్ సీజ్.. జరిమానా

అనంతపురం క్రైం,మార్చి 13(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో కొన్ని దుకాణాలలో అధికారులు ప్లాస్టిక్ సీజ్ చేశారు. కమిషనర్ బాలస్వామి, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. పలు దుకాణాల్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. సంబంధిత దుకాణాలకు రూ.52,500 జరిమానా విధించారు.

సంక్షిప్త వార్తలు

పోక్సోచట్టంపై అవగాహన

ఉరవకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఉరవకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి దుర్గాకల్యాణి హెచ్చరించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో గురువారం ఆమె న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి పోక్సోచట్టంపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. చిన్నారులపై లైంగిక దాడులు నియంత్రించేందుకు పోక్సోచట్టం ఉందన్నారు. దీని గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అలాగే చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓ రవిప్రసాద్, సీడీపీఓ శ్రీదేవి, ఎస్ఐ జనార్ధన్‌నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

గుంతకల్లుటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ రిజర్వ్, అప్రూవల్ అవుట్ రిజర్వ్ ఓపెన్ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ గురువారం ప్రకటనలో హెచ్చరించారు. స్థానిక కసాపురం రోడ్డులోని మైనార్టీ కాలనీలో లేఅవుట్ నెంబరు 9/1999గల రిజర్వ్ ఓపెన్ స్థలాన్ని ఎవరో ఆక్రమించి బండలు నాటారని, దీంతో తాము ఆబండలను తొలగించామని తెలిపారు. ఎవరైనా మున్సిపల్ రిజర్వ్ స్థలాలను అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థినికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. పట్టణంలోని ట్రస్టు కార్యాలయంలో గురువారం ఆయన రూ. 35 వేల నగదును అందజేశారు. కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన పోలప్ప, కొల్లమ్మ దంపతుల కుమార్తె దుర్గేశ్వరి బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో కళాశాల ఫీజు కట్టలేక 5 నెలల నుంచి ఇంటి వద్దనే ఉంటోంది. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ ఆ విద్యార్థినికి ఆర్థికసాయం అందించారు. ట్రస్ట్ కోశాధికారి అబ్దుల్ వాహబ్, సభ్యులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



బసంపల్లిలో పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

శెట్టూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి, శెట్టూరు గ్రామాల్లోగల మెట్ట భూముల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని, రైతులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్లను నీటికుంటలను డ్వామా పీడీ సలీంబాషా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల రైతులందరికీ మెట్టభూముల్లో పండ్ల తోటల పెంపకాన్ని వర్తింప చేస్తామన్నారు. అదేవిధంగా అర్హత ఉన్న ప్రతి రైతుకు మినీ గోకులం షెడ్లు మంజూరు చేస్తామన్నారు. నిర్మాణం పూర్తయిన షెడ్లకు త్వరలోనే బిల్లులు మంజూరయ్యేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఏపీఓ నీరజ, ఈసీ రమణ, టెక్నికల్ అసిస్టెంట్ ఈశ్వరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కులవివక్షపై అవగాహన

కంబదూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురాకులపల్లిలో గురువారం ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ రవిబాబు కులవివక్షపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సోదరభావంతో.. ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలన్నారు. కులవివక్షతో కక్షలు పెంచుకోవడం మంచిది కాదని హితవు పలికారు. సమస్యలేమైనా ఉంటే సున్నితంగా పరిష్కరించుకోవాలని సూచించారు. తహసీల్దార్ బాలకిషన్, హాస్టల్ వార్డెన్ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిచ్చే వారికే విద్యుత్ కనెక్షన్లు

విడపనకల్లు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ కొత్తకోట, హావళిగి వంకల్లో నాన్ ఆయ కట్టు రైతులకు విద్యుత్ సిబ్బంది విద్యుత్ అక్రమ కనెక్షన్లు ఇచ్చి, అసలైన రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ ఎమ్మార్పీఎస్ (దండోరా) నాయకుడు కెంగూరి ఎర్రిస్వామి విమర్శించారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లైన్‌మన్ రామానాయుడు, ఏఈ సత్యం కలిసి చాలా మంది నాన్ ఆయకట్టు రైతులకు విద్యుత్ అక్రమ కనెక్షన్లు ఇచ్చారని పేర్కొన్నారు. ఇందుకు ఇష్టారాజ్యంగా డబ్బు వసూళ్ల చేశారన్నారు. ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

15 ఏళ్ల సమస్యకు పరిష్కారం

- చాబాలలో డ్రైనేజీ కాలవల నిర్మాణం
- గ్రామస్థుల హర్షం


డ్రైనేజీ నిర్మాణానికి ముందు


నిర్మాణం తర్వాత..

ఉరవకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో గత పదిహేనేళ్లుగా మురుగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. డ్రైనేజీల కాల్వలు లేక రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తుండేది. ఆ మురుగునీటిలోనే బీసీ, ఎస్సీ కాలనీ వాసులు వెళ్లాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక అక్కడ రూ.10.4 లక్షల వ్యయంతో డ్రైనేజీ కాల్వలు నిర్మించారు. ఆర్థిక మంత్రి కేశవ్ జడ్పీ నిధులు రూ.8లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.2.4లక్షలు వెచ్చించి వాటి నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో మురుగు నీటి సమస్య నుంచి విముక్తి కలిగడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెన్నకేశవస్వామి సేవలో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి


చెన్నకేశవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, ఆయన తల్లి జేసీ ఉమారెడ్డి

యాడికి, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని గురువారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, ఆయన మాతృమూర్తి జేసీ ఉమారెడ్డి సందర్శించారు. వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామిదర్శనం చేయించారు. అలాగే పూజలు, అర్చనలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తర్వాత వారు శుక్రవారం నిర్వహించనున్న స్వామివారి కల్యాణం, రథోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని బ్రహ్మోత్సవాల పర్యవేక్షకులను ఆదేశించారు. వారి వెంట మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై స్వామివారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శివలక్ష్మీ చెన్నకేశవస్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను గజవాహనంపై కొలువుదీర్చి గ్రామ వీధుల గుండా ఊరేగింపు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

నేడు కల్యాణం, రథోత్సవం

చెన్నకేశవస్వామివారి కల్యాణాన్ని, రథోత్సవాన్ని శుక్రవారం అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణం నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశారు. మధ్యాహ్నం స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

ప్రత్యేక బందోబస్తు

చెన్నకేశవస్వామి రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించనున్నారు. యాడికి యూపీఎస్, యాడికి సర్కిల్, తాడిపత్రి రూరల్ సీఐలు ఈరన్న, రామసుబ్బయ్య, శివగంగాధర్‌రెడ్డిల తోపాటు వందమంది స్పెషల్‌పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. రథోత్సవం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రజలంతా పోలీసులకు సహకరించాలని సీఐ ఈరన్న కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామశివారులో గల 67వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన బ్రహ్మయ్య, దుర్గాప్రసాద్, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన హనుమంతు గ్రానైట్ ఫ్యాక్టరీలో పని చేసేందుకు కొన్ని నెలల క్రితం తాడిపత్రికి వచ్చారు. అయితే ఇప్పుడు స్వగ్రామాలకు వెళ్లేందుకు అక్కడి నుంచి గుత్తి రైల్వే స్టేషన్‌కు ఆటోలో బయలుదేరారు. జక్కలచెరువు గ్రామసమీపంలోకి రాగానే ఆటో ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ప్రమాదంలో ఆ ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిఠాపురానికి తరలిన జనసైనికులు

రాయదుర్గం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు కురుబ సంఘం రాష్ట్ర డైరెక్టర్ కరేగౌడ్ర మంజునాథ ఆధ్వర్యంలో గురువారం పార్టీ శ్రేణులు పిఠాపురానికి తరలివెళ్లారు. 14వ తేదీన పిఠాపురంలో జరిగే పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని జనసేన కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున బస్సుల్లో తరలివెళ్లారు.

తహసీల్దార్ బదిలీ

కణేకల్లు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ ఫణికుమార్ బదిలీ అయ్యారు. గత 6 నెలలుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఈయన తన సీసీఎల్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రాయదుర్గం తహసీల్దార్ నాగరాజుకు బాధ్యతలు అప్పగించారు.

భక్తి శ్రద్ధలతో ఉరుసు ప్రారంభం

గుత్తిరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామశివారులో చెరువు కట్టపై వెలసిన యాదుల్లా బాషా దర్గా 174వ ఉరుసు ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు తొలిరోజు స్థానిక పాతపేట నుంచి గంధంను ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాలో సమర్పించి ప్రార్థనలు చేశారు. భక్తులు పెద్దఎత్తున చక్కెర చదివింపులు చేయించారు. శుక్రవారం ఉరుసు, శనివారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఆర్టీసీ డిపో పరిశీలన

తాడిపత్రి, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఉమ్మడి జిల్లా డిప్యూటీ సీఎంఈ రమేష్‌బాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి గ్యారేజీని తనిఖీచేశారు. అలాగే బస్సుల కండీషన్ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాలంచెల్లిన బస్సులపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ ఆర్టీసీ లాభాల బాటలో పయనించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఇందుకు ప్రధానంగా బస్సులు అధిక మైలేజీ వచ్చేలా చూడాలన్నారు. అనంతరం బస్సు కండీషన్ పరిశీలించేందుకు పదికిలోమీటర్లు ట్రయల్ రన్‌కు వెళ్లారు. ఆయన వెంట డీఎం లక్ష్మీశంకర్, ఎంఎఫ్ మాధవి, ఉద్యోగ సంఘం నాయకులు ఉన్నారు.

గంగమ్మ తిరుణాలను వైభవంగా నిర్వహిద్దాం: జేసీపీఆర్


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాదేవిపల్లి గ్రామ సమీపంలో యర్రగుడి గంగమ్మ తిరుణాలను వైభవంగా నిర్వహిద్దామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గంగమ్మ ఆలయ పరిసర ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉగాది పండుగ మరుసటి రోజు జరిగే తిరుణాలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దామన్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని దేవాదాయశాఖ అధికారులకు, ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో ముళ్ల చెట్లు, గుంతలు లేకుండా శుభ్రపరచాలని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి


మొల్ల జయంతి వేడుకలో టీడీపీ నాయకులు

గుంతకల్లు/ గుంతకల్లు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు పట్టణంలోని అంజలీ నగర్ లో గురువారం కుమ్మరి కుల సంఘం అధ్యక్షుడు అంజి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. టీడీపీ నేత గుమ్మనూరు నారాయణ స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని సంస్కృతంలో నుంచి తెలుగులోని అనవదించిన మొల్లమాంబ ఆదర్శప్రాయురాలని కొనియాడారు. పట్టణంలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కుమ్మరి కుల సంఘ నాయకులు కోరగా.. ఈ విషయాన్ని ఎమ్మెల్యే జయరాం దృష్టికి తీసుకెళ్లి విగ్రహం ఏర్పాటయ్యేలా చేస్తానని నారాయణస్వామి హామీ ఇచ్చారు. తహసీల్దార్ రమాదేవి, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప కుమ్మరి కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గుత్తిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన


జడ్‌వీరారెడ్డి కాలనీవాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుత్తి,మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పట్టణ శివారులోని జడ్‌వీరారెడ్డి కాలనీలో పర్యటించి అక్కడి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము కొన్నేళ్లుగా నివాసమున్నప్పటికీ ఇక్కడ మౌలిక వసతులు లేవని కాలనీవాసులు మొరపెట్టుకున్నారు. సీసీ రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలపై సమగ్రంగా తనకు నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అక్కడ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అలాగే నీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, డీఈ హేమచంద్రకుమార్‌తో చర్చించి వేసవిలో ఎలాంటి సమస్య రానివ్వకూడదని సూచించారు. తర్వాత మండలంలోని బసినేపల్లి గ్రామంలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దారు ఓబులేసు, డిప్యూటీ తహసీల్దారు సూర్యనారాయణ, ఎంపీడీఓ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నత స్థాయిలో రాణించాలి

ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నత స్థాయిలో రాణించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. పట్టణ శివారులో గల గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఇన్‌స్పిరేషనల్ టాక్ అనే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఇంజనీరింగ్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. 2047నాటికి భారత దేశం నెంబర్-1 కావాలన్నదే ధ్యేయంతో ముందుకు సాగాలన్నారు. ఇందుకు ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్‌లో ఎక్కువగా కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ కేంద్రాన్ని ప్రారంభించారు. గేట్స్ కళాశాల డైరెక్టర్ వీకే శ్రీవాణి, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం బోర్లు

కూడేరు, మార్చి 13 (ఆంధ్యజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీకాలనీతో పాటు కడదరకుంట గ్రామంలో గురువారం తాగునీటి సమస్య తీర్చేందుకు గాను టీడీపీ నాయకులు బోర్లు వేయించారు. రెండు బోర్లలో పుష్కలంగా నీళ్లు పడ్డాయి. దీంతో ఇరవైఏళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యకు తెరపడినట్లయిందని నాయకులు తెలిపారు. మంత్రి పయ్యావుల సోదరుల ఆదేశాలతో ఈ బోర్లు వేయించామన్నారు. అనంతరం సర్పంచు లలితమ్మ, నాయకులు జయప్రకాష్‌గౌడ్, బొమ్మయ్య, బాటవెంకటేష్, గొల్ల వెంకటేష్, ఎద్దుల సుధాకర్, చిన్నఈశ్వరయ్య తదితరులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులకు, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్యపై వినతి

రాయదుర్గంరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అన్ని వార్డులో ఎండా కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కొండాపురం శ్రీనివాసులు, తిప్పేస్వామి, దాసరి సత్యనారాయణ, ప్రహ్లాద, గోవిందు, పైతోట శీన పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసుల జారీ

గుత్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి):పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని సర్వే నంబర్ 530లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్న 17 మంది నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ ఓబులేసు గురువారం తెలిపారు. వెంటనే స్థలాన్ని ఖాళీ చేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయానికి వెండి ఊయల

రాయదుర్గం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయానికి వాల్మీకి సంక్షేమ సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు బండి కిష్టప్ప, తన సతీమణి సరస్వతితో కలిసి వెండి ఊయలను సమర్పించారు. ఆలయంలో గురువారం ఆయన ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. తొలుత కుటుంబసభ్యులతో కలిసి సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేయించారు.

హోలీని శాంతియుతంగా జరుపుకోవాలి

రాయదుర్గంరూరల్/ బొమ్మనహాళ్/ కణేకల్లు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు శుక్రవారం హోలీ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ జయనాయక్, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్, కణేకల్లు ఎస్ఐ నాగమధు సూచించారు. ఆయా పోలీస్‌స్టేషనల్లో గురువారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ప్రజలు శాంతిభద్రతల నిబంధనలు పాటించాలన్నారు. హోలీ వేడుకలు, రంజాన్ ప్రార్థనలు ఎవరికి వారు సంప్రదాయాలను పాటిస్తూ.. పరస్పర గౌరవంతో నిర్వహించుకోవాలని తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

బెళుగుప్ప, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బెళుగుప్ప తండాకు చెందిన టీడీపీ కార్యకర్త దీనసింగ్‌నాయక్ గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు శీనా నాయక్, తిప్పేస్వామి తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు

విడపనకల్లు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపురం, వీ కొత్తకోట గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను గురువారం వేశారు. ఉరవకొండ డీడీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది ఈ కార్యక్రమం చేపట్టారు. మాళాపురంలో 250 పశువులకు, వీ కొత్తకోటలో 320 పశువులకు టీకాలు వేశారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే

కూడేరు, మార్చి 13 (ఆంధ్యజ్యోతి): రీ సర్వేతో భూముల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దారు మహబూబ్ బాషా పేర్కొన్నారు. పైలెట్ గ్రామంగా జయపురం రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేయడంతో అక్కడి రైతులతో గురువారం ఆయన పి. నారాయణపురంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతుల సమక్షంలోనే భూ రీ సర్వే జరుగుతుందన్నారు. ఎటువంటి సమస్యలున్న అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. రీ సర్వే డీటీ దబ్బరప్రసాద్, మండల సర్వేయర్ అయేషా సిద్దికి తదితరులు పాల్గొన్నారు.

పీ 4 సర్వే పరిశీలన

బొమ్మనహాళ్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో చేపడుతున్న పీ4 సర్వేను డీఎల్‌డీఓ నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ.. పీ4 సర్వే ను పక్కాగా చేపడుతూ.. వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ భాస్కర్, ఈఓపీఆర్డీ దాస్, పంచాయతీ కార్యదర్శి శివన్న, వీఆర్వో యుగంధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులోకి చేపపిల్లలు విడుదల


చెరువులోకి చేపపిల్లలను వదులుతున్న అధికారులు

పుట్లూరు, మార్చి 13(ఆంధ్ర జ్యోతి): మండలకేంద్రంలోని చెరువులోకి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 40శాతం సబ్సిడీతో చేపపిల్లలను వదలినట్లు గురువారం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా 29,600 చేపపిల్లలను జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి ఫక్కీరయ్య, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ అలివేలమ్మ తదితరులు వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేపల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీడీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, చెన్నారెడ్డి, సర్పంచు బాబు, ఫిషనరీ అసిస్టెంట్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

మామిడితోటల పరిశీలన

రాయదుర్గంరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులదట్ల గ్రామంలో గల మామిడితోటలను హార్టికల్చర్ అధికారిణి మౌనిక గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి చెట్లు పూతదశ, కాయ దశలో ఉన్నాయన్నారు. ఇప్పుడు తామరపురుగుల తెగులు సోకే అవకాశం ఉందన్నారు. దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. నాణ్యమైన అధిక దిగుబడులను పొందేందుకు గాను ప్రభుత్వం మామిడి పండ్లకు రక్షణ కవచం (ఫ్రూట్ కవర్)ను రాయితీ పై అందిస్తోందని, ఒక ఫ్రూట్ కవర్ రూ. 2 చొప్పున ఒక హెక్టార్ వరకు రాయితీతో అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పగలే చోరీ

తాడిపత్రి, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నెలో గల జగనన్నకాలనీలో గురువారం పట్టపగలే చోరీ జరిగిందని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కాలనీలోని చాంద్‌బాషా, బీబీ దంపతులు నాపరాళ్ల పరిశ్రమలో కూలీపనులు చేస్తూ జీవనం సాగించేవారు. రోజు మాదిరిగా గురువారం ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. కాగా మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 2తులాల బంగారు గొలుసు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ధరణీబాబు సిబ్బందితో కలిసి పరిశీలించారు. క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యాడికి, మార్చి13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వేములపాడు గ్రామానికి చెందిన దాసరి కిరణ్ (22) అనే యువకుడు గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వివరాలిలా ఉన్నాయి. దాసరి కిరణ్ ఈనెల 9వ తేదీన యాడికి నుంచి వేములపాడు గ్రామానికి బైక్‌లో వెళుతుండగా.. ఉన్నట్టుండి పంది అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా కుటుంబసభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య , ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు వారు చెప్పారు.

రేపు ప్రజాదర్బార్

రాయదుర్గం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15వ తేదీన ప్రజాదర్బార్‌ను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఇందులో ప్రజాసమస్యలపై అర్జీలను స్వీకరిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవవైవిధ్య పంటల సాగుపై అవగాహన

పెద్దవడుగూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిడుతూరు గ్రామంలో గురువారం జీవవైవిధ్య పంటల సాగుపై జిల్లా ఎస్ఎఫ్ఏ అధికారి భానుమతి రైతులకు అవగాహన కల్పించారు. మండల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.